క్లుప్తంగా

యోగా సాధనతో జ్ఞాపక శక్తి



ఉపాధ్యాయులు, విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఉరవకొండ: యోగా సాధనతో విద్యార్థులకు జ్ఞాపక శక్తి పెరుగుతుందని, రోజంతా చదువులో పట్టు సాధిస్తారని ప్రముఖ యోగా గురువు ఓబులేసు గురూజీ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రేణుమాకుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో యోగాంధ్రలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు యోగాసనాల్లో శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం సాకే భాస్కర్ ఆధ్వర్యంలో యోగా గురువు ఓబులేసు మాట్లాడుతూ యోగాతో సర్వరోగాలు దూరమవుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

పనుల నాణ్యతలో రాజీపడొద్దు



ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుళ్లాయి స్వామి

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులను నాణ్యతగా చేయించాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన పి.నాగిరెడ్డిపల్లిలో చేస్తున్న ఫారంపాండ్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడారు. నిబంధనల మేరకు పనులు చేస్తే కేటాయించిన మేరకు వేతనం వర్తిస్తుందని తెలిపారు. ఇప్పేరు సచివాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య, ఇంజినీర్ రాజేష్ పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



ఉరవకొండ అంబేడ్కర్ ఎస్సీ గురుకులం గదుల్లో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: పట్టణంలోని గురుకులాలతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో దోమల నివారణ మందు మంగళవారం పిచికారీ చేయించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు రాఘవేంద్ర, నిమ్మల వెంకటేష్ పర్యవేక్షణలో మలేరియా సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఉరవకొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మతో పాటు కస్తూరిబా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఫాగింగ్ చేపట్టడం వల్ల దోమల వ్యాప్తి పూర్తిగా తగ్గుతుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచిన 'కూటమి'



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: ఉద్యోగం వచ్చేదాకా భృతి ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కొట్రేష్ విమర్శించారు. మంగళవారం పట్టణంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కరపత్రాలను విడుదల చేశారు. కొట్రేష్ మాట్లాడుతూ అధికారంలోకొచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ఈ ప్రభుత్వంపై పోరాడి సమస్యలను పరిష్కరించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నాగయ్య, శంకర్, దినకర్, జునైద్, రమేష్, షాయబ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో చోరీ

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల గ్రామ సచివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం విధులకు హాజరైన ఏఎన్ఎం అనిత.. తన గది తాళాలను బద్దలుగొట్టిన విషయాన్ని గుర్తించి లోపలకు వెళ్లి పరిశీలించారు. వివిధ రకాల విలువైన మందుల బాక్సులు, పరికరాలు అపహరించినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏఈఓలు బాధ్యతల స్వీకరణ

కూడేరు: మండల వ్యవసాయ శాఖ ఏఈఓలుగా రాఘవేంద్ర, దిలీప్ కుమార్‌లు బదిలీపై వచ్చారు. మంగళవారం వీరు బాధ్యతలు స్వీకరించారు. జల్లిపల్లి క్లస్టర్‌కు దిలీప్ కుమార్, కూడేరు క్లస్టర్‌కు రాఘవేంద్రలు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈఓ శైలజ బుక్కరాయసముద్రం మండలానికి బదిలీపై వెళ్లారు.

ఆర్డీటీ పరిరక్షణే అందరి లక్ష్యం

- మాజీ ఎంపీ రంగయ్య పాదయాత్రకు భారీ స్పందన
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అన్ని వర్గాల వారూ సంఘీభావం



ఈస్ట్ కోడిపల్లిలో కొనసాగుతున్న తలారి రంగయ్య పాదయాత్ర



ముదిగల్లులో సాగుతున్న ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ పరిరక్షణకు మాజీ ఎంపీ తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం రంగయ్య చేపట్టిన పాదయాత్ర మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. మండలంలోని ఈస్ట్ కోడిపల్లి, మల్లిపల్లి, ముదిగల్లు మీదుగా బోరంపల్లి వరకు సాగింది. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, మున్సిపాలిటీ కన్వీనర్ ఐ సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వివిధ మండలాల కన్వీనర్లు ఎంఎస్ రాయుడు, జీకే రాయుడు, పాలబండ్ల చంద్ర శేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, పాలాక్షి, రామాంజనేయులు యాదవ్, దొడగట్ట నారాయణ, సత్తి, పాతలింగ, గోపాల్ రెడ్డి, పిల్లలపల్లి అంజి, కామక్కపల్లి మల్లి, చరణ్, శ్రీకాంత్, బిక్కి హరి, ఎస్. తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, హరి, కో ఆప్షన్ అప్జల్, శ్రీకాంత్ రెడ్డి, వన్నూర్ రెడ్డి, ఈ.రాము, నాగలక్ష్మి, కాంతమ్మ, సునీత, వైస్ ఎంపీపీ హనుమంతరాయుడు, సర్పంచు శోభారాణి, ఎంపీటీసీలు బలరాం, భాస్కర్, దురదకుంట వన్నూరుస్వామి, లక్ష్మన్న, కిరీ టీ యాదవ్, దొడగట్ట మురళి, భీమప్ప, కేశవగౌడ్, షే క్షావలి, పాతలింగ, మల్లి, రాజు, పాతన్న పాల్గొన్నారు.

కోడిపల్లిలో.. శివారెడ్డి, వన్నూరుస్వామి, త్యాగరాజు, వన్నప్ప, లక్ష్మన్న, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, రవి, మల్లిపల్లిలో వైఎస్ చిత్తయ్య, బడప్ప, చౌడప్ప, మధు, ఓబిలేశు పాల్గొన్నారు. **ముదిగల్లులో..** కౌన్సిలర్లు గోపారం హేమావతి, కుర్రారాము, అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, నరేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, పురుషోత్తం, భీమలింగ, బోరంపల్లిలో సోమశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అంజినరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడి, హరి, శ్రీనాథ్‌రెడ్డి, అని పాల్గొన్నారు.

పలువురు ప్రముఖుల సంఘీభావం..

మాజీ ఎంపీ రంగయ్య చేస్తున్న ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు పార్టీ పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు ఉమాపతి, న్యాయవాదులు రాజశేఖర్ యాదవ్, నరేంద్రరెడ్డి, రమణారెడ్డి, హనుమంతరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, నాగరాజు, అశ్వర్థ నారాయణ, జి.ఎర్రిస్వామి, దాదాఖలందర్, భంగి రవికుమార్, హరి, రామాంజనేయులు, బీటీ రామాంజనేయులు, హరి, ఉమాపతి, ఎర్రిస్వామి సంఘీభావం తెలిపారు.

పలువురు ఎంపీపీల మద్దతు..

తలారి రంగయ్య ఆర్డీటీ కోసం చేస్తున్న పాదయాత్రకు మంగళవారం పలువురు ఎంపీపీలు తమ మద్దతు తెలిపారు. మల్లిపల్లి వద్ద కళ్యాణదుర్గం ఎంపీపీ మారుతమ్మ ఆంజనేయులు, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, ఆత్మకూరు, కంబదూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం మండలాల ఎంపీపీలు కరణం పుష్పావతి, దేవి, నారాయణరెడ్డి, హేమలత, భీమేష్, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీలు బొమ్మయ్య, గుద్దెళ్ల నాగరాజు, నాయకులు భీంరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దేవేంద్ర, రంగనాయకులు, గంగాధర్, రాజేంద్ర, మనోజ్, సుంకన్న, గిరి, సత్తి పాదయత్రకు సంఘీభావం తెలిపారు.

కూడేరు: ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు ఎత్తివేయాలని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి కూడేరు నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు మంగళవారం కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి వద్ద వీరు సంఘీభావం తెలిపారు.

వజ్రకరూరు: ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు ఎత్తేయాలని చేస్తున్న రంగయ్య పాదయాత్రకు వజ్రకరూరు, విడపనకల్లు మం డలాల ఎంపీపీలు రమావత్‌దేవి, కరణం పుష్పావతి సంఘీభావం తెలిపారు. మంగళవారం కళ్యాణదుర్గం మం డలం ఈస్ట్‌కోడిపల్లి, మునిగల్లు గ్రామాల్లో సాగిన పాదయాత్రలో ఎంపీపీలు రమావత్‌దేవి ,కరణం పుష్పావతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గడేకల్లు భీమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు సామానాయక్ పాల్గొన్నారు.

విడపనకల్లు: తలారి రంగయ్య చేపట్టిన పాదయత్రకు విడపనకల్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. కోడిపల్లి నుంచి నిర్వహించిన పాదయాత్రలో ఎంపీపీ కరణం పుష్పావతి, నాయకులు కరణం భీంరెడ్డి, బీసీ సెల్ నాయకులు కురుబ గిరిబాబు, ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, నాయకులు మద్దతు తెలిపారు. యూత్ నాయకులు సత్తి, చంద్రబాబు, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.



ముదిగల్లులో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో తలారి రంగయ్య



రంగయ్య పాదయాత్రకు మద్దతు తెలిపిన వివిధ మండలాల ఎంపీపీలు



సేవ్ ఆర్డీటీ పాదయాత్రలో పాల్గొన్న అనంతపురం వైఎస్సార్‌సీపీ నేతలు



ముదిగల్లు వద్ద కూలీలకు ఆర్డీటీ సేవలపై వివరిస్తున్న తలారి రంగయ్య

ఆకుపచ్చ తెగులు నివారించుకోవాలి

ఉరవకొండ: వేరుశనగ పంటకు ఎక్కువగా శనగపచ్చ పురుగు, పచ్చదోమ సోకకుండా అప్రమత్తంగా ఉండాలని రైతులకు ఏఓ రామకృష్ణుడు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోందిలో భాగంగా ఆమిద్యాల, మోపిడి గ్రామాల్లో వేరుశనగతోపాటు ఇతర పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ వేరుశెనగ పంటకు తెగుళ్లు ఆశించకుండా ఇమామెక్టిన్ బెంజోమేట్ 1 ఎంఎల్ ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. నివారణకు కార్బనిజం ప్లస్ మ్యాన్కో జాబ్ మందు రెండు గ్రాములు ఒక లీటర్ చొప్పున పిచికారీ చేయాలన్నారు.



ఆమిద్యాలలో వేరుశనగ పంట పరిశీలిస్తున్న ఏఓ రామకృష్ణుడు

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

కూడేరు: విత్తన శుద్ధితో తెగుళ్లను నివారించొచ్చని వ్యవసాయాధికారి శుభకర్ తెలిపారు. మంగళవారం గొటుకూరు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏఓ శుభకర్ మాట్లాడుతూ వేరుశనగ ఊడలు దిగే సమయంలో ఎకరాకు నాలుగు బస్తాలు జిప్సం వేస్తే వేరుశనగ కాయల సైజు పెరిగి బరువు ఎక్కువగా వస్తాయని తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు జమ కోసం అందరూ వేలి ముద్ర వేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు

వజ్రకరూరు: పంటల సాగులో మెలకువలు పాటించి, రైతులు మంచి దిగుబడులు సాధించాలని ఏఓ మధుకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని చాబాల,చిన్నహోతూరు గ్రామాల్లో అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏలు కళ్యాణి, శరణ్య, రైతులు పాల్గొన్నారు.

విడపనకల్లు: చీకలగురికి, ఉండబండ గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వేసవిలో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు చేశారు. రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏడీఏ పద్మ జేఈఓ కైలాస్‌నాథ్, ఏఓ పెన్నయ్య, ఎంపీఈఓ లక్ష్మన్న, వీఏఏ లక్ష్మన్న, రైతులు పాల్గొన్నారు.

2,140 క్వింటాళ్లు పంపిణీ

కుందుర్పి: డివిజన్ వ్యాప్తంగా నాలుగు రోజులుగా 2,140 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసినట్లు కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప తెలిపారు. మంగళవారం ఏడీఏ కుందుర్పి, కళ్యాణదుర్గం తదితర మండలాల్లో విత్తన పంపిణీని పరిశీలించారు. ఐదు మండలాలకు కలిపి 13,850 క్వింటాళ్ల విత్తనం మంజూరు కాగా, 6,752 క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉందన్నారు. రైతులు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించి, విత్తన కాయలను తీసుకెళ్లాలని సూచించారు.

విత్తనకాయలు సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: రాయితీ వేరుశనగ విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు మోనాలిసా, ఏఓ మధుకర్ తదితరులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌ఎస్‌కేలో విత్తనకాయలు పంపిణీ చేశారు. ఏఓ మధుకర్ మాట్లాడుతూ మండలానికి 2వేల క్వింటాళ్ల కే6 విత్తన కాయలు కేటాయించినట్లు తెలిపారు. సర్పంచు మోనాలిసా, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రక్షణ కరువు

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు



మాట్లాడుతున్న మహిళా విభాగం నేతలు

ఉరవకొండ: కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు బోయ సుశీలమ్మ, వజ్రకరూరు ఎంపీపీ దేవిబాయి, వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలీసా, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వసంతమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోవిలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై వరుసగా జరుగుతున్న అత్యాచారాలు, అభం, శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసి టీడీపీ నాయకులు కొట్టడం సరికాదన్నారు. ఒక మహిళ హోం మంత్రిగా ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు బాధ్యత వహించి, హోంమంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా భోజరాజ్‌నాయక్



రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా డి హీరేహాళ్ మండలం సిద్దాపురం తండాకు చెందిన వడిత్య భోజరాజ్‌నాయక్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన జారీ చేసింది. పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

బిగుస్తున్న ఉచ్చు

- బోగస్ పట్టాల సృష్టికర్తపై కలెక్టర్ ఆరా
- నోటీసుల జారీతో అక్రమార్కుల్లో వణుకు
- పేదల స్థలాలు కాజేసిన వారిపై చర్యలకు సిద్ధం



తన పట్టా వేరొకరికి కేటాయించారని ఆవేదన చెందుతున్న మహిళ

రాయదుర్గం: పట్టణంలోని గౌడ, బీటీపీ, మల్లాపురం లేఔట్లలో వెలుగు చూస్తున్న నకిలీ రెవెన్యూ పట్టాల వ్యవహారం కలకలం రేపుతోంది. రోజుకో మలుపు తిరుగుతోంది. నకిలీ పట్టాల తయారీ ముఠా సభ్యుల్లో వణుకు మొదలైంది. లోతుగా విచారిస్తే జైలుకెళ్లక తప్పదనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. రియల్టర్లతో చేతులు కలిపి లేఔట్లలో ఇష్టారాజ్యంగా బోగస్ పట్టాలు సృష్టించిన వారిపై జిల్లా కలెక్టర్ ఆరా తీసినట్టు తెలుస్తోంది. రాయదుర్గంలోని అన్ని ఇందిరమ్మ లేఔట్లలో స్థానిక తహసీల్దార్ నాగరాజు సర్వే నిర్వహించారు. లేఔట్ ఏర్పాటు చేసే సమయంలో పట్టాలు పొందిన అర్హులు ఎవరు? వారు ముందుకు రాని పక్షంలో మధ్యలో రెవెన్యూ రికార్డుల ప్రకారం మార్చి అర్హులకు ఇచ్చిన పట్టాలు ఎన్ని? ప్రస్తుతం ఎవరున్నారు? అనే కోణంలో విచారణ జరిపించారు. రికార్డుల్లో ఉండే లబ్ధిదారుల పేర్లతో నోటీసులు జారీచేశారు. సకాలంలో ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావాలని నోటీసులు అతికించారు. దీంతో బోగస్ పట్టాదారుల్లో వణుకు కనిపిస్తోంది. డబ్బులు తీసుకున్న కొందరు ఫోన్లు ఎత్తకపోగా, సదరు అధికారి తనకు సంబంధమే లేదని బుకాయిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఆరాతో ఎక్కడికి దారి తీస్తుందోనని అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

అర్హులకు అందిస్తాం

ప్రభుత్వ లేఔట్లలో సర్వే నిర్వహించి ఎన్ని ఖాళీలు ఉన్నాయి.. ఎంత మంది కట్టుకునేందుకు ముందుకు రాలేదు.. గుర్తించి వారందరికీ నోటీసులు జారీ చేశాం. లేఔట్ ఏర్పాటు సమయంలో అర్హులు ఎవరుంటారో వారి పేర్లతోనే ప్లాట్ నంబర్ల వారీగా నోటీసులు అతికించేలా చర్యలు చేపట్టాం. ఇందులో అర్హులు ఎవరో? నకిలీ ఎవరో? తేలాల్సి ఉంది. నోటీసులు అతికించిన లబ్ధిదారులంతా ముందుకు వచ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. ఇప్పటికి స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణ చేపడతాం. రెవెన్యూ రికార్డుల్లో లేకుండా పట్టాలు ఎన్ని ఉన్నా రద్దు చేస్తాం . ఆ పట్టాలు ఎలా పుట్టుకువచ్చాయో విచారిస్తాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

మద్యం అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కళ్యాణదుర్గం రూరల్: కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరాను అడ్డుకోవడానికి చర్యలు తీసుకున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా అరికట్టలన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరాను నియంత్రించాలని సిబ్బందిని ఆదేశించారు.

మద్యం షాపు నిర్వహణకు రీనోటిఫికేషన్.. :

మున్సిపాలిటీ పరిధిలోని 127 మద్యం షాపు నిర్వహణకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి ఉన్న వారు ఈనెల 19వతేదీ సాయంత్రంలోపు ఆన్‌లైన్‌లో గానీ, ఎక్సైజ్ స్టేషన్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలని డీసీ తెలిపారు. 21న అనంతపురంలోని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో షాపును అభ్యర్థులకు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఇన్‌స్పెక్టర్లు సోమశేఖర్, ఆంజనేయులు, శంకర్ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ



దెయ్యాల దిబ్బ ప్రధాన రహదారిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు

కుందుర్పి: మండల కేంద్రంలో విలువైన ప్రభుత్వ స్థలాలను కొందరు స్వార్థపరులు ఆక్రమిస్తున్నారు. గడ్డివాములు, దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులుగానీ, పంచాయతీ సిబ్బందిగానీ పట్టించుకోలేదని ప్రజలు అంటున్నారు. రెవెన్యూ కార్యాలయానికి ఆనుకొని ఉన్న కృష్ణమ్మ గుట్ట, దెయ్యాల దిబ్బ, కళ్యాణదుర్గం రహదారికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలు, భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమించేవారిపై చర్యలు చేపట్టి సంబంధిత భూములను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పరంపర సాగుతోంది. 2015–19 మధ్య కాలంలో సర్వే నంబర్ 222, 221 సర్వే నంబర్లలో రెండెకరాలకు పైగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, ఇప్పటికే పక్కా ఇళ్లు, గడ్డి వాములు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులకు స్థానిక సర్పంచ్, కుందుర్పి ప్రజలు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు.

హై ఓల్టేజీతో కాలిపోయిన విద్యుత్ ఉపకరణాలు

- లబోదిబోమంటున్న బాధితులు



ఏఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కణేకల్లు: విద్యుత్ హై ఓల్టేజీ కారణంగా ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయంటూ స్థానిక విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం ఎదుట మంగళవారం బాధితులు ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. కణేకల్లులోని ఇందిరమ్మ కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీకి విద్యుత్ సరఫరా సరిగా ఉండదు. సోమవారం ఉదయం నుంచి కరెంటు సరఫరా లేకపోవడంతో స్థానికులు విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిబ్బంది అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి వెళ్లారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో హై ఓల్టేజ్‌తో విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో ఇళ్లలో భారీ శబ్దాలు చోటు చేసుకుని పొగ కమ్ముకుంది. ఏమైందో... అర్థం కాక కాలనీవాసులంతా బయటికొచ్చారు. కాసేపటి తర్వాత పరిస్థితి నెమ్మదించడంతో ఇళ్లలోకి వెళ్లి పరిశీలించారు. వైరింగ్, టీవీలు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్లు, ఫ్యాన్‌లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు కాలి బూడిదైనట్లుగా గుర్తించారు. దాదాపు రూ.30 లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో మంగళవారం ఉదయం విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయానికి కాలనీవాసులు చేరుకుని ధర్నా చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే హై ఓల్టేజీ ప్రసరించి ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కురుబ లలితమ్మ, కానిస్టేబుల్ ప్రసాద్, డాక్టర్ నయిమ్‌బాషా, ఖాదర్, టైలర్ గౌస్, కురుబ బసవరాజు, కార్పెంటర్ బిలాల్, మహమ్మద్ హనీఫ్, మన్సూర్, బషీర్, ఇర్ఫాన్, సర్మస్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన విశ్వ



అధినేత వైఎస్ జగన్‌తో విశ్వ

రాయదుర్గం: విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం కలిశారు. స్థానిక రాజకీయాలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని జగన్ ఆదేశించినట్టు విశ్వ తెలిపారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి



తలారి రంగయ్య, బోయతిప్పే స్వామి, నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపీ ,కళ్యాణదుర్గం నియోజక వర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. మండల ఉపాధ్యక్షుడిగా కొండాపురానికి చెందిన రామును ఎంపిక చేశారు. మంగళవారం బోరంపల్లిలో తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొండాపురం రామును నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లింగప్ప, నరసింహప్ప, నరసప్ప, తిప్పేస్వామి, పుట్టప్ప, చనమల్ల, కుల్లాయి స్వామి, అశోక్, నటరాజ్, ఓబులేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముస్తాబైన జమాలుద్దీన్ ఖాద్రీ దర్గా



ఉరుసుకు ముస్తాబైన హజరత్ జమాలుద్దీన్ ఖాద్రీ దర్గా

ఉరవకొండ: స్థానిక జామీయ మసీదు వద్ద ఉన్న హజరత్ సయ్యద్‌షా జమాలుద్దీన్ ఖాద్రీ తాసీర్ దర్గా 35వ ఉరుసు ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 18 నుంచి ఉరుసు ప్రారంభం కానుంది. మొదటిరోజు గంధం వేడుకలు, దర్గా ఆవరణ నుంచి పట్టణ వీధుల గుండా ఊరేగించి, తిరిగి దర్గాకు చేరుస్తారు. 19న ఉరుసు, 20న జియారత్ వేడుకలతో ఉత్సవాలు ముగియనున్నాయి. సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్‌బాబా ఆధ్వర్యంలో భక్తులు ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉరుసుకు జిల్లా నలుమూలల నుంచి కాక కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలు తొలగించక ముందు..

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండలో 'వెల్‌నెస్ సెంటర్‌లోకి వెళ్లాలంటే భయం..భయం' అనే శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైంది. దీనిపై వైద్య, పంచాయతీ అధికారులు స్పందించారు. వెల్‌నెస్ సెంటర్ చుట్టూ పెంచుకున్న పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగింపజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగించాక ఇలా..